
# కుక్క ఆశ



'పోరా కుక్కా!' అంటారు ఎదుటి మనిషి ఏదైనా తప్పుచేస్తే. అలాంటిదే తప్పో, ఒప్పో మరొకడు మరొకడు చేస్తే 'వాడొక కుక్క' అంటారు. ఎదుటిమనిషి ఇష్టాయిష్టాలకు తలవంచకపోతే 'ఆ కుక్కతో ఏం పనిరా?' అంటారు. కుండ బద్దలు కొట్టినట్లుగా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే 'ఆ కుక్క మొరిగితే మొరిగింది లేరా!' అంటారు. ఎవడైనా కాస్త నోరు చేసుకొని మాట్లాడితే 'అరిచేకుక్క కరవదులేరా!' అంటారు. కొంపలో చేతికి ఎదిగి దేనికీ ఒదగని వాడొకడుంటే 'కుక్క మొగాన విదిలించినట్టు వాడి మొగానంత కొట్టండి!' అంటూ నిష్ఠూరాలాడతారు.

అంత హీనమైన జంతువా కుక్క?

కాదే? కన్నబిడ్డల్ని ఆయాల చేతికిచ్చే కలిగిన తల్లులుంటారేమో కానీ అందాలకుక్కల్ని ఒడిలో చేర్చుకొని ముద్దులాడని ముద్దుగుమ్మలుంటారా? కాలుమీద కాలేసుకొని దర్జాగా కార్లోకూర్చుని కుక్కల్ని గుండెలమీద ఆడించుకొంటున్న దృశ్యాలు గిలిగింతలు పెడుతుంటాయి కదా? సువర్ణాక్షరాలతో లిఖించకపోతే పోయారు. అందంగా ఫ్రేం కట్టించి ఇవ్వకపోతే పోయారు. విశ్వాసానికి అర్థం తెలియని మనుషులు 'కుక్క విశ్వాసమైన జంతువు' అని ఎప్పుడో

సర్టిఫికెట్ ఇచ్చేశారు కదా? ఆ విశ్వాసాన్ని కథలుగా మలిచి మరీమరీ చెప్పుకుంటున్నారుగదా! అందుకేనేమో మనిషి కొన్ని సందర్భాల్లో ఎంత హీనాతి హీనంగా చిత్రిస్తున్నా కుక్కలు మరిచిపోతున్నాయి. మన కొంపలముందు విధిగా కుక్కలుగానే కావలి కాస్తున్నాయి.

ఈ మాత్రం బుద్ధి మనిషికి ఉందా?

ఉంటే?– పాపం ఆ కుక్క తెల్లవారుజామునుండి ఆ కుప్పతొట్టి దగ్గర పడిగాపులు కాయవలసిన అవసరమే లేదు.

ఒక్కసారి ఆ కుప్పతొట్టి వైపు చూడండి.

ఆ కండ్లతోనే ఆ మేడను కూడా చూడండి!

మూడంతస్థుల మేడ. ముచ్చటగా ముందు వెనుకల తోట. ఆ తోటలో రకరకాల పూబాలల సయ్యాట... ఆ మేడకు రక్షణ కవచంలా అందాల ప్రహరీగోడ. ఆ ఆవరణలో నాజూకైన నాలుగు బార్ల కారు. ఈగ జొరబడకుండా ఇంటిముందు ఘూర్కా!

దారిలో వస్తూపోతూ ఆ మేడ బాహ్యస్వరూపాన్ని గమనించినవాళ్ళు 'అది ఎవడిదో కలిగినవాడి మేడ' అనుకొంటారు. అయితే అది ఊహకు అందని స్థాయి!

ఆ మేడలో గోడల్ని చూడు. ఆ గోడలమీద అక్కడొకటి అక్కడొకటిగా వేలాడతీసిన చిత్రాల్ని చూడు. కట్టిన కర్టెన్లు చూడు. పరిచిన తివాచీల్ని చూడు. వాటిమీద అమర్చిన శిల్పాల్ని చూడు. తీర్చిదిద్ది పెట్టినట్లున్న వస్తువుల్ని చూడు. కళాత్మకమైన మనసులు అధునాతనమైన రీతుల్ని ఆకళింపుచేసుకొని ఆవిష్కరించినతీరు అద్భుతం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ ఇంట్లో అడుగుపెడితే విడిచిరావడానికి బుద్ధిపుట్టదు.

అటువంటి ఇంటినే వదిలి వచ్చిందా కుక్క!

అక్కడ దాని దర్పం. అక్కడ దాని దర్జా. అక్కడ దానికి జరిగే గౌరవమర్యాదలు చూసినవాళ్ళు 'కుక్కకింత భోగమా?' అని అసూయపడేవాళ్ళు. వాళ్ళు అసూయపడుతుంటే అది ఆనందపడేది. ఆ ఆనందంలో కించిత్‌గర్వం కూడా. విడమర్చి చెప్తేనే విని నడుచుకోలేని జన్మాలకు ఆ మొరుగుడులోని ఆంతర్యం అర్థమవుతుందా? ఆ గర్వంతో 'ఈ లోకంలో అనుభవించాలంటే పెట్టిపుట్టి ఉండాలిరా పిచ్చినాగన్నలారా!' అంటూ గొంతెత్తి మొరిగేది.

అటువంటి చోటునే వదులుకొని బయటపడింది!

భార్యాబిడ్డల్ని రాజభోగాల్ని విడిచిపెట్టిన సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. అంతటి రాజభోగాలు కాకపోయినా ఈలోకంలో ఒక సాదాసీదామనిషి పనీపాటా ఏమీలేకుండా హాయిగా కూర్చొని అనుభవించలేని అరుదైన సుఖాల్ని త్యాగం చేసిందా కుక్క!

అదే కుక్కబుద్ధి!

ఇంతకాలంగా ఆ కుక్క బతుకు గడించిందెక్కడ? అందాల మేడలో. అలాంటి మేడల్లో ఆశయాల ఆచరణల నీడలు పడడానికి వీలుందా? పడితే సహిస్తారా? మెత్తటి పరుపులు...

కుషన్ కుర్చీలు....కమ్మటి తిండి...కార్లలో విహారాలు...అందాల శరీరాల స్పర్శలు...ఇవే ఇవే లోకమనుకొనింది. అయితే అసలు సిసలైన లోకం ఆ కుప్పతొట్టి దగ్గర కనిపిస్తూ ఉంది.

'భౌ!...భౌభౌ!... భౌభౌభౌ....భౌ!" ఉన్నట్లుండి ఆ కుక్క మొరిగింది.

ఎవ్వరో ఒకావిడ చేతిలో చేట. చేటలో చెత్త. వయ్యారంగా వస్తూ ఉంది. వచ్చి చెత్తను కుప్పతొట్టిలో కుమ్మరిస్తుంది. కుక్క గమనించింది. అలా జరగడానికి వీల్లేదు. అందుకే మొరిగింది.

దానిరూపు...దాని చూపు! పాపం. హడలిపోయిందావిడ. చేతిలో తేట జారి కిందపడింది. చెత్త నేలపాలయింది. ఆ చేటను చేతికందుకొని ఆమె పరుగో పరుగు!

కుక్క గుండె తేలికపడింది.

తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో ఆ కుప్పతొట్టి దగ్గరికి వచ్చిందా కుక్క వస్తూనే కాసేపు ఏడ్చింది. ఆ ఏడుపు ఎవరి చెవిలో పడలేదు. పడివుంటే – 'అయ్యో కుక్క ఏడుపా? అనర్థాలకు మూలమే!' అని చీదరించుకొనేవాళ్ళు.

ఎదుటివ్యక్తి ఏడుపును చీదరించుకోకుండా అర్థం చేసుకోవడమంటే మాటలా? అందుకు కావలసింది సహృదయత. అంతకుమించిన అవగాహన. ఆ అవగాహనే ఉంటే ఈ లోకంలో ఇన్ని కష్టాలకు, కన్నీళ్ళకు తావుంటుందా? అందుకే ఎవరి కష్టం వాళ్ళది. ఎవరి కన్నీళ్ళు వాళ్ళవి!

అలాంటప్పుడు ఒక కుక్క కన్నీళ్ళను గురించి ఎవరైనా పట్టించుకుంటారా?

అత్యంత అధునాతనమైన అందాల భవంతిలో అట్టహాసం రెట్టమదంగా బతికిన ఆ కుక్క రోతరోతగావున్న కుప్పతొట్టి ముందు పడిగాపులు కాస్తూఉంది.

ఆ జాతికుక్కను అక్కడ ఎవరైనా చూస్తే నిజంగా ఆశ్చర్యపడతారు.

కానీ అదిమాత్రం తనకర్తవ్యంగా భావించింది.

తూర్పుదిక్కున కొండలమాటునుండి సూర్యుడు పైకి రాబోతున్నాడు. ఎక్కడో వస్తున్న గజరాజు గంటలు ముందుగానే హెచ్చరిక చేసినట్లు ఎప్పుడో రాబోతున్న సూర్యుడికోసం తూర్పుదిక్కు ఎంతో అందంగా తయారయింది. మబ్బులు వెండి జరీఅంచుల్ని సంతరించుకొంటున్నాయి. ఆకాశరాజు ఎక్కడో ఎర్రదుమ్ములో పొర్లాడి పైకి లేస్తున్నట్లున్నాడు. పక్షుల కిలకిలలు గుండెల్ని గిలిగింతలు పెడుతున్నాయి. ఆకాశమంతా తమదే అయినట్లుగా ఎంతో స్వేచ్ఛగా ఎగురుతున్నాయి.

ఆ నాలుగు గోడలమధ్య... అదే ఒక దేవేంద్ర లోకమైనట్టుగా... అవే రాజభోగాలైనట్టుగా బావిలోకప్పలా బతికిన తనకు అలాంటి స్వేచ్ఛ లేకపోయిందే? అన్నట్టుగా ఆ కుక్క ఎగురుతున్న పక్షుల్ని ఎంతో ఆసక్తిగా గమనిస్తూ ఉంది.

రెండుమూడు ఊరకుక్కలు ఆ కుప్పతొట్టికి కొంత దూరంలో గొంతుకూర్చున్నాయి. ముక్కులు ఎగరేస్తూ ముందుకు రాలేక జంకుతున్నాయి. జిహ్వచాపల్యంతో ఎదురుచూస్తున్నదీ

కుక్కలే! కావలి కాస్తున్నదీ కుక్కే! ఊరిబుద్ధి ఊరకుక్కలకు అలవడినా మేడబుద్ధులు ఈ కుక్కకు అలవడనట్లుంది!

అందుకే ఆ కుప్పతొట్టి మీద ఈగవాలితే విరుచుకుపడుతూ ఉంది.

అంతవరకు ప్రశాంతంగా పడుకొన్న రోడ్లు కలగని మేల్కొన్నట్టు మేల్కొన్నాయి.

కార్లమీద స్కూటర్లమీద బస్సుల్లో జనం... జనం. గోలగోలగా జనం. అటు చూడండి. మొండికేస్తున్న రిక్షాతో పోరాడుతూ ఎముకలగూడు... ఉరుకులు పరుగులమీద పేపరు కుర్రవాడు... పనసచెట్టుకు కాసిన కాయల్లా సైకిలు వెనకాముందూ....పక్కల్లో వేలాడుతున్న పాలక్యాన్లతో పాలవాడు!

ఎక్కడికీ పరుగులు? ఎందుకీ పరుగులు?

జీవనపోరాటానికి!

ఈ పోరాటంలో గెలవడంలో అందముంది. ఆనందముంది. తృప్తి ఉంది. అన్నిటికీ మించిన గౌరవం ఉంది. కాలూచెయ్యి కదపకుండా మూడుపూటలూ ముక్కుల దాకా మెక్కుతూ ఉప్పుబస్తాల్లా ఒళ్ళు పెంచుకోవడం! ఛీఛీ! అదీ ఒక కూడేనా? అదీ ఒక బతుకేనా?

అందుకేనేమో? రెక్కలు ముక్కలు చేసుకొని బతికే కాంతమ్మ అంటే ఆ కుక్కకు ఎనలేని గౌరవం. ఆ వేళకే ఆమె ఆ దారిన రావలసింది. రాలేదు. ఆమె కోసమే ఆ కుక్క ఎదురుచూస్తూ ఉంది. కాంతమ్మకోసం ఎదురుచూస్తున్నా ఒక కన్ను కుప్పతొట్టిమీద మరొక కన్ను కాంతమ్మ కోసం రోడ్డుమీద!

జీవనపోరాటానికి బయలుదేరిన జనసైన్యం రోడ్డు మీద పడింది. పడుతూ లేస్తూ ముందుకు పోతూఉంది. వాళ్ళల్లో ఒకతె కాంతమ్మ. ఆ కాంతమ్మలా కనిపిస్తే దృష్టిని అటు మరల్చింది. కాదు. కాదని తేలేసరికి తిరిగి చూసింది. కుప్పతొట్టిమీద కాకులగుంపు. దాని గుండెలవిసిపోయాయి. అమాంతంగా పైకెగిరి వాటిపై పడింది. అవి చెల్లాచెదరయ్యాయి. విజయగర్వంతో దృష్టిని రోడ్డువైపు మరల్చింది.

కనుచూపుమేరలో కాంతమ్మ.

దాని ఆనందానికి మేరలేదు. ఎగిరి గంతులు వేసింది. అది ఆనందంతో చిందులు తొక్కుతూంటే 'ఎగిరి ఎక్కడ తమమీద పడుతుందో?' అని ఊరకుక్కలు తోక ఝాడించాయి. వాటివెంట పడుతున్నట్టుగా అది పరిగెత్తింది. కాంతమ్మ ముందు గసపోసుకొంటూ నిలబడింది.

కాంతమ్మ కన్నుల్లో సందేహం!

"ఇక్కడికెందుకొచ్చావ్! ఇక్కడ నీకేంపనిరా బుజ్జీ!" అన్నట్టుగా చూస్తూ ఉంది.

ఆలోపలే కుప్పతొట్టి దగ్గర మళ్ళీ కాకిగోల!

ఇక్కడెగిరి అక్కడ. అక్కడెగిరి కుప్పతొట్టి దగ్గర. రెండే రెండు అంగల్లో కుప్పతొట్టిమీద పడింది. కాకి గుంపు చెల్లాచెదరై పైకెగిరింది. అల్లంత ఎత్తులో వాటి అబ్బసొత్తు ఎవరో లాక్కొన్నట్టు రెక్కలతో గుండెలు బాదుకొంటున్నాయి. ఆ కుప్పతొట్టి చుట్టూ తిరుగుతూ గోల

చేస్తున్నాయి. ఆ గోలతో రోడ్డుమీద వస్తూపోతూవున్న ప్రజల దృష్టి కుప్పతొట్టిమీద పడుతూ ఉంది.

అది దానికి నచ్చలేదు. 'ఏంవిటీ కాకిగోల' అన్నట్టుగా తల పైకెత్తి కాకిగుంపువైపు ఉరిమి ఉరిమి చూస్తూ ఉంది.

అంతలో దాని తలమీద చెయ్యి పడింది.

అది కాంతమ్మ చేయి!

వెంటనే ఆ కుక్క ఆమె పైటకొంగు నోటకరుచు కొనింది. కుప్పతొట్టి దగ్గరికి లాగుతూ ఉంది. కాంతమ్మ సందేహంగానే దానివెంట నడిచింది. కుప్పతొట్టి దగ్గర నిలబడింది.

ఆ కుక్క ఉన్నట్లుండి రెండు కాళ్ళమీద పైకిలేచింది. ఆమె రెండు భుజాలమీద రెండు కాళ్ళు ఉంచింది. నోటితో జుట్టు పట్టుకొనింది. కుప్పతొట్టిలోకి చూడమన్నట్టుగా ఆమె తలను వంచింది. ఆమె గ్రహించింది. కుప్పతొట్టిలోకి తొంగిచూసింది.

కెవ్వుమని అరిచింది!

ఆమెకాదు– ఎవరైనా అదే పనిచేస్తారు ఆ దృశ్యాన్ని చూస్తే.

అక్కడికి తన పని తీరిపోయినట్లు ఆ కుక్క స్థిమితంగా కూర్చొనింది.

కాంతమ్మ కలిగిన ఇల్లాలుకాదు. బతుకులో నలిగిన ఇల్లాలు. కలిగినవాళ్ళ ఇండ్లల్లో రెక్కలు ముక్కలు చేసుకొంటూ డొక్క నింపుకొంటున్న సాదాసీదా మనిషి. కాంతమ్మకు నిజంగా ఇదొక పరీక్ష!

"దయాదాక్షిణ్యాలు ఆత్మీయానురాగాలు ఎక్కడ ఉంటాయి? మిద్దెలూ మేడల్లోనా? పూరిగుడిసెల్లోనా? నిరూపించు కాంతమ్మా" అన్నట్లుగా ఆ కుక్క కాంతమ్మవైపు ఎంతో విశ్వాసంగా చూస్తూఉంది.

సందేహం ఎందుకు? పెట్టలేకపోయినా ప్రేమాభిమానాలు పేదసాదల గుండెల్లోనే ఉంటాయి!

అదో చూడండి. కాంతమ్మ చేతుల్లో కసుగందును!

ఒంటినిండా నెత్తురు మరకలు. బొడ్డు కూడా కోయలేదు. ఏ చేతులో నిర్దాక్షిణ్యంగా విసిరిపారేసిపోతే ఈ చేతులు ఆప్యాయంగా ఎత్తుకొన్నాయి. ఎదకు హత్తుకొన్నాయి. పైటచెంగుతో నెత్తురు మరకల్ని తుడుస్తున్నాయి.

ఎలా ఉన్నాడు బిడ్డ?

ముద్దులు మూటగట్టుతూ అపరంజిబొమ్మలా ఉన్నాడు.

ఎలా చేతులాడాయో?

ఇప్పుడు కాంతమ్మ కన్నుల్ని గమనించండి. ముత్యాలు రాలుతున్నాయా? ఎక్కడివి ఆ ముత్యాలు? పేదసాదల గుండెల్లోనుండి పెల్లుబికిన ప్రేమాభిమానాలు. అవే కావలసింది. వాటికోసమే ఆ కుక్క తపించింది. తహతహలాడింది.

నీరెండ పండుతూ ఉంది. లోకం నిగనిగలాడుతూ ఉంది. ఆ నిగనిగల్లో కాంతమ్మ ఎదమీద పసికూన మిలమిలా మెరిసిపోతున్నాడు. రోడ్డుమీద రద్దీ ఎక్కువయింది. కార్లు... మోటార్లు... స్కూటర్లు... సైకిళ్ళు– జనం జనం. ఉరుకు పరుగులమీద జనం జనం. వాళ్ళ చూపులు ఒక్కక్షణం కుప్పతొట్టివైపు మరలినట్లు మరలి మళ్ళీ మామూలైపోతున్నాయి. అమాయకులు ఎందరో లాకప్ మరణాల పాలవుతుంటే ఏమి? అభం శుభం ఎరుగని కసుగందులు కుప్పతొట్ల పాలవుతుంటే ఏమి? ఎవడికి కాబట్టింది? ఎవడి తాపత్రయం వాడిది?

కాంతమ్మ దృష్టి ఆ మేడవైపు మళ్ళింది. ఆ కుక్కకు ఒళ్ళురగిలింది. ఎగిరి ముంగాలితో మూతిమీద కొట్టింది.

అమాయకురాలు కాంతమ్మ. ఆమెకేం తెలుసు? సందేహంగా ఆ కుక్కవైపు చూస్తూ ఉంది. "ఏంవిటా వెర్రిచూపులు? అటుకాదు, ఇటు" అన్నట్టుగా కాంతమ్మ కొంగుపట్టి ఆమె ఇంటివైపు లాగుతూఉంది. కాంతమ్మ గ్రహించింది. ఆమె ముందు, కుక్క వెనుక. ఇద్దరూ కాంతమ్మ ఇంటివైపు నడుస్తున్నారు.

*　　*　　*　　*　　*

కాంతమ్మ కలగలుపు మనిషి. ఓర్పుకు మారుపేరు. కష్టానికి పర్యాయపదం. ఎంత కష్టపడుతున్నా పెదవుల మీద చిరునవ్వు మాత్రం మాయదు. పిలిస్తే పలుకుతుంది. చెప్పిన పని చేస్తుంది. ఎవరి దగ్గర ఎలా మసలుకోవాలో ఆమెకు బాగా తెలుసు. అనవసరంగా వాగడంకానీ అనవసర విషయాల్లో తలదూర్చడంగానీ ఆమెకు తెలియదు. ఆమె ఆ మేడలో అడుగుబెట్టి నెలలు నిండలేదు. అయితే అప్పటికే ఆమెకు నెలలట!

ఆమె ఆ మేడలో అడుగు పెట్టినరోజు–

"అమ్మా! ఒక పూటకు ఉంటే మరొకపూటకు లేని కుటుంబంలో తల్లిదండ్రులకు ఒక్కతే కూతుర్ని. మూడుపూటలు కూటికి నోచుకోలేకపోయినా ముద్దు మురిపాలకు ఏ లోటూ లేకుండా బతికాను. అష్టకష్టాలైనా పడి పెద్దపెద్ద చదువులు చదివించాలని అమ్మానాన్నా చదివిస్తున్నారు. నేను శ్రద్ధగా చదువుతున్నాను. పదవ తరగతి చదువుతున్నాను. అప్పుడు పరిచయమైంది ఆ అబ్బాయితో.

అతడు ఎదురింటి మేడమీద ఒక గదిలో ఉండేవాడు.

మాది అటు మిద్దె ఇటు పూరిల్లుకాని పెంకుటిల్లు. ఒక్కటే గది. వంటకు వార్పుకు స్నానానికి పానానికి పడకకు అన్నిటికీ ఆ ఒక్కటే గది. ఆ గదిలోనుండి బయటికి వస్తేచాలు అతని చూపులు ఒళ్ళంతా గుచ్చుకునేవి. మొదటమొదట అసహ్యం కలిగిందికానీ తల్లిలాంటి తమతో అపద్ధం చెప్పడం ఎందుకు? అసహ్యం ఆరాధనగా మారడానికి ఎక్కువకాలం పట్టలేదు!"

వయస్సు చేతిలో మనిషి ఎప్పుడూ బానిసే కదా?

మేడ గుండెలు శ్రద్ధగా అంతకంటే ఆసక్తిగా వింటున్నాయి.

"ఆ అబ్బాయి గ్రహించాడు. నా ఆరాధనాభావాన్ని ఆసరాగా తీసుకొని సరాసరి ఇంటికే వచ్చాడు. అతని వినయం విధేయత ఆ పలకరింపులో ఆత్మీయత ఆ మాటవరస– నాకంటే

ముందు అమ్మానాన్నకు అప్పుడై పోయాడు. వారాలు తిరగకముందే ఆ ఇంట్లో ఒక సభ్యుడై కూర్చున్నాడు.

నన్ను నోరారా 'అమ్మా!' అనిపిలిచేవాడు. ఎంతో కష్టపడి చదవాలని... మంచి మార్కులతో తప్పనిసరిగా పదవ తరగతి పాస్ కావాలని, కాలేజీ చదువులు చదవాలని, ఏదో ఒక ఉద్యోగం సాధించుకొని అమ్మానాన్నకు అండదండగా నిలబడాలని మాటమాటకు హెచ్చరిస్తూ ఉండేవాడు.

అతని మాటలమీద గురి కుదిరింది. అతనిమీద మునుపటికంటే గౌరవం పెరిగింది. అమ్మానాన్నను తప్పించి నా అన్న వారెవరూ లేని ఈ లోకంలో నా శ్రేయస్సు కోరి చెప్తూఉంటే గౌరవభావం కలగదా? మీరే చెప్పండి.

నెలలు తిరగకముందే మా పరిచయం ఎంతవరకు ఎదిగిందంటే తెలియని పాఠాలు అతని పక్కనే కూర్చొని అడిగి తెలుసుకునేవరకు ఎదిగింది!

కాలేజీలో నన్ను చేర్పించడానికి అతడుపడ్డ శ్రమ చూపినశ్రద్ధ అమ్మానాన్నను ముగ్ధుల్ని చేసింది. ఎదిగినబిడ్డ ఇంట్లో ఉందన్న సంగతి కూడా దాదాపు వాళ్ళు మరిచిపోయారు.

ఆరోజు అమ్మానాన్న ఇంట్లో లేరు. ఏదో సెలవుదినం. నాకు కాలేజీలేదు. అతనికి ఆఫీసులేదు. మా ఇంట్లోనే కూర్చుని ఏదో పాఠం చెబుతున్నాడు. నేను శ్రద్ధగా వింటున్నాను. చెబుతున్న పాఠాన్ని ఉన్నట్లుండి ఆపి–

"కాంతా! నేను నీ కాంతుడు కావాలనుకొంటున్నాను!" అన్నాడు.

కలలో కూడా ఊహించని మాట. ఒక పక్క భయం. మరొకపక్క సందేహం!... నన్ను పట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే అతనివైపు భయంభయంగా చూస్తున్నాను.

"ఏంవిటా చూపులు? సందేహిస్తున్నావా? నాలుగు అంకెలజీతం. బ్యాంకు ఉద్యోగం. నిన్ను నీ తల్లిదండ్రుల్ని పోషించలేనా?"

అతని మాటల్ని నమ్మాను. బలైపోయాను!

ఆ తర్వాత తెలిసింది. అప్పటికే అతడు ఒకబిడ్డ తండ్రి అని! నిష్కారణంగా భార్యను కొట్టికోసి చంపుతూంటే ఆ బాధలుపడలేక ఆమెపుట్టిల్లు చేరుకొనిందని!

అప్పటికే నాకు మూడో నెల!

కష్టాల కడలిలో ఏదో ఆధారం దొరికిందని మురిసిపోతుంటే ఆ ఆధారమే నిర్దాక్షిణ్యంగా ముంచేస్తే ఏంచేయను చెప్పండి? అటువంటి దుర్మార్గుడితో కాపురం చేయలేను. తల్లిదండ్రులకు ఈ పాడుమొగాన్ని చూపలేను. మరి మరొకమార్గం ఆత్మహత్య. ఆ పేదకొంపలో డబ్బా కిరసనాయిలు లేకపోవచ్చు. రెండు పాతకోక పేలికలు లేకపోలేదు. అయితే చచ్చి ఎవరిని సాధించాలి? సాధించాలంటే నా కాళ్ళమీద నేను నిలబడాలి. నా కడుపులో పెరుగుతున్న బిడ్డను ప్రయోజకుణ్ణి చేయాలి. అప్పుడు అటువంటి నయవంచకుల పనిపట్టాలి. అందుకే రాత్రికిరాత్రే ఇల్లు వదిలి వచ్చేశాను. నా తప్పు క్షమించండి. నన్ను చూసి కాకపోయినా నా

కదుపులో పెరుగుతున్న కసుగందును చూసిఅయినా తమ ఇంట్లో పాచిపని చేసుకునే అవకాశం కల్పించండి".

ఎగ్గొట్టుకొస్తున్న ఏడుపును మింగలేక దిగమింగుతూ కాంతమ్మ ఆ మేడలో తనగోడు వెలపోసుకున్నప్పుడు సాధారణంగా ఇటువంటి కథలకు కరగని మేదగుండెలు కూడా కరిగాయి. కారణం ఇరవైఏండ్ల కిందట ఆ ఇల్లాలి అనుభవం కూడా అదే. అయితే తాను మోసానికి గురికాలేదు. కాంతమ్మ అయింది.

కాంతమ్మ ఆ మేడలో పనిమనిషిగా కుదిరింది.

కాంతమ్మ అంటే ఆ కుక్కకు జాలి. ఆ కుక్కంటే కాంతమ్మకు అభిమానం. పెద్దపెద్ద చదువులు చదవకపోతే ఏం! మనసున్న మనిషి కాంతమ్మ. ఆ మేడలో ముద్దుమురిపాలతో మునిగితేలినా కరస్పర్శలతో కౌగిలింతలలో పరవశించినా కార్లల్లో ఊరేగినా ఒళ్ళు కడిగిందెవరు? ఏ వేళకేం పెట్టాలో వేళతప్పకుండా శ్రద్ధగా పెట్టిందెవరు? కాంతమ్మ. కుక్కనే కన్నబిడ్డలా చూసుకున్న కాంతమ్మ. ఎవరు కన్నబిడ్డయినా బిడ్డే కదా? ఆ బిడ్డను చూసుకోదా? అందుకే ఆ కుక్క కాంతమ్మకోసం ఎదురుచూసింది. బాధ్యతను అప్పగించింది.

* * * * *

ఆ కుక్క నడక. కాంతమ్మ పరుగు. ఇప్పుడు వాళ్ళు రద్దీగావున్న రాజమార్గాన్ని వదిలి సందుగొందుల్లో నడుస్తున్నారు. రద్దీగావున్న రోడ్లమీద ఎవరి హడావిడి వాళ్ళది. కానీ సందుగొందుల్లో అలా కాదు. అందరి దృష్టి వాళ్ళిద్దరిమీదనే ఉంది. కాంతమ్మ చేతుల్లో కసుగందును చిన్నసైజు చిరుతలాంటి ఆ కుక్కను వాళ్ళ హడావిడిని వింతగా చూస్తున్నారు. బహుశా ఏ కలిగిన అమ్మాయి పక్కలో కార్లో ఊరేగవలసిన జాతికుక్క సందుగొందుల్లో పడిందే? అన్న సందేహం కావచ్చు. ఆ కార్లు..కలిగిన అమ్మాయిల వెనక దాగిన భయంకర సత్యాలు ఈ అమాయక ప్రజలకేం తెలుసు?

కాంతమ్మ మనసులో ఏముందో? పూనకం పూనిన మనిషిలా ముందుకు దూసుకొని పోతూ ఉంది.

ఊరి శివార్లలో మురుగుకాలువ. ఆ కాలువగట్టున వరుసగా గుడిసెలు. ఆ గుడిసెల్లో ఒకానొక గుడిసెలో కాంతమ్మ కాపురం.

నడక పరుగ్గా ఆ ప్రాంతానికి చేరుకొన్నారు.

కాంతమ్మ గుడిసెపక్కన అలాంటిదే మరొక గుడిసె. ఆ గుడిసెలో ఒక అవ్వ. ఆ అవ్వ కాంతమ్మకు చేదోడువాదోడు. కాంతమ్మ అవ్వదగ్గర తన గుడిసె తాళంచెవిని తీసుకొనింది. తలుపు తెరిచింది. మైలబుట్టలో మాసినగుడ్డలు. వాటిలో కొన్ని పాతపేలికల్ని ఏరుకొనింది. పొత్తిళ్ళుగా అమర్చింది. ఆ పొత్తిళ్ళమీద పురిటిబిడ్డను పడుకోబెట్టింది. పుల్లాపుడక వేసి పొయ్యి రగిలించింది. రగులుతున్న పొయ్యిమీద సత్తుగిన్నెలో నీళ్ళు పెట్టింది. నీళ్ళు కాగుతున్నాయి.

అప్పుడు అవ్వను పిలిచింది.

"ఏంటిది నీ హడావుడి? ఎక్కడిదీబిడ్డ? కుండగాలని ఈ బతుకుల్లో ఈ గుండెలమీద కుంపటెందుకే?" అంటూ అవ్వ నిలదీసింది.

కాంతమ్మ అదేమీ పట్టించుకొనే స్థితిలో లేదు.

"అవ్వా! నీ చేతుల్తో బొడ్డుకొయ్ అవ్వా?" అని అవ్వచేత బొద్దు కోయించింది. సత్తుగిన్నెలో నీళ్ళు వెచ్చబడ్డాయి. గోరువెచ్చని నీళ్ళతో ఆ కసుగందు ఒళ్ళంతా తుడిచి శుభ్రం చేసింది.

ఆ బిడ్డ ఏడుపు అందుకొన్నాడు. కాంతమ్మ బిడ్డకు పాలివ్వబోతే "అప్పుడే పాలెందుకిస్తావే పిచ్చిపిల్లా! పాలాడ చక్కెరనీళ్ళు పట్టించరాదా?" అన్నది అవ్వ.

కాంతమ్మ ఆ ప్రయత్నంలో పడింది. స్పూన్‌తో చక్కెరనీళ్ళు కొద్దికొద్దిగా తాపుతూ ఉంటే మెల్లగా నిద్రలో జారుకొన్నాడా బిడ్డ. అప్పుడు పొత్తిళ్ళల్లో పడుకోబెట్టింది. కోక ఉయ్యాల్లో నిద్రపోతున్నాడు నవమాసాలుమోసి కన్నబిడ్డ. పొత్తిళ్ళలో కునుకు తీస్తున్నాడు– కుప్పతొట్టిపాలైన బిడ్డ. కాంతమ్మ ఒక్కక్షణం ఇద్దరివైపు మార్చిమార్చి చూసింది. భారంగా నిట్టూర్చింది. అయినా ఆ కన్నుల్లో ఎంత తృప్తి? అప్పుడు–

"అవ్వా! ఇక్కడున్నట్టే వచ్చేస్తాను. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. వాళ్ళు అడిగితే ఏం చెప్పాలో ఏమో? పిల్లల్ని జాగ్రత్త అవ్వా!" అంటూ కాంతమ్మ పరుగందుకొనింది.

ఆ కుక్క గడపలో ఠీవిగా కూర్చొనింది.

అభం శుభం ఎరుగని కసుగందు హాయిగా నిద్రపోతున్నాడు. పులిలా గడపలో కూర్చున్న కుక్కవైపు అవ్వ భయంభయంగా చూస్తూ ఉంది. మురుగుకాలువ నుండి వస్తున్న కంపుతో వొళ్ళు జలదరిస్తూ ఉంది. రకరకాల విదేశీ పరిమళాలకు అలవాటుపడిన ఆ కుక్క ఆ దుర్గంధాన్ని భరించలేనట్లుగా మాటిమాటికి తల అడ్డంగా తిప్పుతూ చెవులు కొట్టుకుంటూ ఉంది. కుక్క చెవులు కొట్టుకోవడం అశుభసూచకమని అవ్వ అయిష్టంగా ఆ కుక్కవైపు చూస్తూ ఉంది. మురుగుకాలువ దుర్గంధం తెంపులుతెంపులుగా వస్తూవుంటే కుక్క చెవులు కొట్టుకోవడం ఎక్కువయింది. కుక్క కూడా భరించలేని ఆ కంపును మనుషులెలా భరిస్తున్నారు? అలవాటు. ఎంత అలవాటయినా ఈ కుళ్ళు కంపుతోనే గదా ఈ జనానికి రోగాలు... నడమంత్రపు చావులు. సుగంధ పరిమళాల్లో తేలియాడుతూ కొందరు. కుళ్ళుకంపుతో తనకలాడుతూ కొందరు. ఎందుకీ వ్యత్యాసం?

మనుషులందరూ ఒకేవిధంగా ఈ భూమిమీద పుడుతున్నారు. అయితే ఈ మనుషులు సృష్టించుకున్న వైరుధ్యాలతో పెంచుకొంటున్న మనస్తత్వాలతో ఈ లోకంలో ఇన్ని వ్యత్యాసాలు. ఆ గుడిసెలో చేరిన ఇద్దరు కసుగందులే దీనికి సాదృశ్యాలు!

ఆధారంగా నిలబడతానంటే నమ్మి కాంతమ్మ లొంగిపోయింది. ఆరాధిస్తున్నానంటే మేడలో మెడబిరుసు పిల్ల పొంగిపోయింది. ఇద్దరు పిల్లలు పద్ధతి తప్పినందుకు ఫలితాలే. అయితే గుడిసెకున్న ప్రేమాభిమానాలు మేడలో కరువయ్యాయి. అయినా అంత ఘాతుకమా? ఏ శిశుమందిరానికైనా చేర్చవచ్చుగదా? తెలిసో తెలియకో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారు.

అది తప్పు. తప్పుచేయడం ఎవరికైనా సహజమే! అయితే ఆ తప్పును మాపుకోవడానికి మరొకతప్పు. అభంశుభం ఎరుగని కసుగందును కుప్పతొట్టి పాల్చేయడం! గుండెలా అవి? కాదు. వాటికంటే చాకిరేవుల్లో బండలే మేలు. కనీసం దుస్తుల మాలిన్యాన్ని అయినా పోగొడతాయి.

కుక్కలు ఆలోచించలేవన్న మనిషి అభిప్రాయాలకు మసిపూసి సాగిన కుక్క ఆలోచన!

గంట పది దాటినట్లుంది. పొత్తిళ్ళల్లో పసికూన ఏడుస్తూ ఉంది. ఆ ఏడుపు చెవిన పడడంతో కోక ఉయ్యాల్లో పిల్లవాడు మేల్కొన్నాడు. వాడు ఏడుపు అందుకొన్నాడు. ఆ కుక్క నిస్సహాయంగా అటు యిటు చూస్తూ ఉంది. ఆ కుక్కను చూసి అవ్వ భయపడి దూరదూరంగా తిరుగుతూ ఉంది. కుక్క గ్రహించింది. గడపలో నుండి లేచింది. వాకిట్లోకి నడుస్తూ ఉంది. బిడ్డల్ని సముదాయించడానికి అవ్వ గుడిసెలోకి పోతూఉంది.

ఈ పరిస్థితిని ఊహించినట్లుగా కాంతమ్మ పరుగులమీద వస్తూ ఉంది.

ఆ కుక్క ఆనందానికి అవధులులేవు. తోకాడించుకుంటూ కాంతమ్మకు ఎదురుగా పరిగెత్తింది. ముంగాళ్ళెత్తి కాంతమ్మ పాదాలమీద పెట్టి సాగిలపడింది. ఆ ముంగాళ్ళు అందమైన మూతులమీదనో మెత్తని ఎదలమీదనో ఆడుకున్న ముంగాళ్ళు. అయినా ఆ పిచ్చిపిల్లకేం తెలుసు?

కాంతమ్మ, ఆమె వెనక కుక్క ఒకరితర్వాత ఒకరుగా గుడిసెలోకి నడిచారు. అవ్వ ఇద్దరు పిల్లల్ని సముదాయించలేక అవస్థపడుతూ ఉంది. కాంతమ్మ చేతిలో గిన్నెల్ని పక్కన పెట్టింది. గుక్కపట్టి ఏడుస్తున్న పొత్తిళ్ళలో పసికూనను చేతులకెత్తు కొనింది. ఉన్న ఓపికను కాస్త మేడ మింగేస్తే ఉసూరుమంటూ గుడిసెగోడకు చేరగిల పడింది. రైకముడి విప్పింది. ఒక్క స్తనం పసికూన నోటికందించింది. అది వాడినోట్లో ఇమడలేదు. ఇమిడించడానికి తంటాలు పడుతూఉంది. అంతలో అవ్వచేతిలో కుర్రవాడు కేర్‌మన్నాడు. వాడిని ఒక చేత్తో అందుకొనింది. చెరొక తొడమీదుగా ఇద్దరు పిల్లలు పాలుతాగుతున్నారు.

కుక్కలు ఒకేసారి ఐదారు పిల్లలకు పాలిస్తూ ఉంటాయి. పట్టించుకునేవాళ్ళుండరు. కాంతమ్మ ఇద్దరి పిల్లలకు ఒకేసారి పాలిస్తూంటే ఆ కుక్క చూస్తూ ఆనందబాష్పాలు రాలుస్తూ ఉంది.

పురిటికూన చిన్నిపొట్ట నిండినట్టుంది. వాడు పాలు తాగడంమాని కాళ్ళు చేతులు విదిలిస్తున్నాడు. అప్పుడు కాంతమ్మ వాడిని అవ్వచేతికి ఇచ్చింది. ఆ అద్దబాల బిడ్డను అరచేతుల్లో ఉంచుకొని 'ఏ మిద్దెల్లోనో మేడల్లోనే పుట్టాల్సిన బంగారు కొండ' అంటూ మురిసిపోతూఉంది.

"అవ్వా! ఎంతమంచిమాటన్నావు. ఈ బంగారుకొండను పొత్తిళ్ళల్లో మోయలేని చేతులు అవి చేతులా? నన్ను తాకడానికి ఆ చేతులకు అర్హత ఉందా? అందుకే ఆ మేడను విడిచిపెట్టాను. ఈ పిచ్చితల్లికి నువ్వయినా చెప్పు!" అన్నట్లుగా కుక్క అవ్వవైపు ఆరాధనగా చూస్తూ ఉంది.

అప్పుడు కాంతమ్మ దృష్టి కుక్కమీద పడింది.

మేడలో దాని తిండితీర్థాలుసంగతి కాంతమ్మకు తెలుసు. పదిగంటలకు పైబడుతున్నా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదని తెలుసు. అందుకే గిన్నెలో కూడు కుక్క ముందర పెట్టింది.

"కాంతమ్మా! ఈ కూడు నీతోడు చెబుతున్నాను. ప్రేమాభిమానాలు లేనికూడు. ఈ కూడు మీకొద్దు. ఈలాంటి బతుకులూ మీకొద్దు. ఈ బతుకులుమారితీరాలి. ఇది కుక్కాశే కావచ్చు. కుక్కాశ గుండ్రాతితో తీరిందంటారు. గుండ్రాతితోనే కాదు ఇలాంటి బతుకులు మారకపోతే దేనిలోనూ తీరదు!" అన్నట్లుగా ఆ కుక్క తల అడ్డంగా తిప్పుతూ ఉంది. ఆ గిన్నెనూ కాంతమ్మను మార్చి మార్చి చూస్తూ ఉంది.

"ఏం చెయ్యమంటావురా బుజ్జీ? ఇది మేడకాదు. గుడిసె. మేడలో అయితే నువ్వు కోరిన తిండి పెట్టేదాన్ని. ఇక్కడ నేను తినేదే నువ్వూతినక తప్పదు!"

కుక్కచూపుల్లో భావాన్ని చదవలేని కాంతమ్మ దాని తిండిని గురించి ఆలోచిస్తూ దీనంగా దానివైపు చూస్తూఉంది.

"ఏ కూడు కుడిచినా ఫరవాలేదనుకునే కుక్కలు మనిషిజాతిలో కోకొల్లలు. కుక్కలు అలా కాదు. అలా అయివుంటే ఈ కథ కుప్పతొట్టిదగ్గరే ఆగిపోయేది. కాదా చెప్పు!" అన్నట్లుగా కుక్క కాంతమ్మ ముఖంలోకి సూటిగా చూస్తూఉంది.

ఆ చూపుల్లో అంతరార్థాన్ని పసిగట్టలేని కాంతమ్మ బేలగా చూస్తూఉంది.

"ఏం చూస్తావ్ కాంతమ్మా! మీ జాతి కుర్చీలకోసం కుమ్ములాడుకొని చస్తూ ఉంటే కనకపు సింహాసనాన్నే వదులుకొని వచ్చినదాన్ని. సుమతీశతకకారుడు రాసిన పద్యాన్ని తిప్పి రాయాల్సిన అవసరం వచ్చింది. నాకు కావాల్సింది అలాంటి కవిగానీ ఈ కూడు గాదు" అన్నట్లుగా ఆ కుక్క పాలు తాగుతున్న పిల్లవానివైపు తృప్తిగా చూస్తూఉంది.

ఏమనుకొందో ఏమో కాంతమ్మ పాలాడ చనుబాలు పిండి చిప్పలో పోసి ఆ కుక్క ముందు పెట్టింది.

ఆ కుక్క కన్నులు చెమ్మగిల్లాయి.

"భరించలేను కాంతమ్మా! ఇంత త్యాగాన్ని భరించలేను. నమ్మించి ఎవడో బాధ్యత నెత్తిన పెడితే పచ్చివొంటితో పాచిపనులు చేసి బతుకుతున్నావు. ఆ పరిస్థితిలో మరో బరువు పెట్టాను. చాలని కొదవకు నా బాధ్యత కూడానా? వద్దు కాంతమ్మా వద్దు" అన్నట్లుగా తల అడ్డంగా తిప్పుతూ ముంగాళ్ళు ముందుకు సాచి సాగిలపడింది. ఒకటిరెండు నిమిషాలు. అంతలోనే పైకి లేచింది. చిప్పలోని చనుబాలను తదేకంగా చూస్తూ ఉంది.

రెండు కన్నీటిబొట్లు జారి ఆ చిప్పలో పడ్డాయి!! ●

ఆంధ్రభూమి
(26, నవంబర్ 1992)